ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

జయశంకర్ 5 భూపాలపల్లి

శుక్రవారం 8 నవంబరు 2024



ఆగని దందా

- యథేచ్ఛగా రేషన్ డీలర్ల అక్రమ వ్యాపారం
- దారి మళ్లుతున్న పేదల బియ్యం
- పట్టించుకోని అధికారులు
- ఆర్డీవో ఆదేశించినా కదలని అధికారులు!

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ డీలర్లపై నిఘా కరువైంది. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం దారిమళ్లుతోంది. పలువురు డీలర్లు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. స్టాక్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉండగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ షాపులకు వచ్చే రేషన్ బియ్యం ఎంత.. ఎంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.. దుకాణంలో ఇంకా స్టాక్ ఎందుకు మిగిలింది? అనే అంశాలను పరిశీల్సించాల్సిన అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

అక్రమంగా విక్రయం

జిల్లాలో ప్రతి నెల 277 రేషన్ షాపుల ద్వారా 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ అవుతోంది. 1,23,686 రేషన్‌కార్డులకు సంబంధించిన 3,47,302 లబ్ధిదారులకు ఈ బియ్యం అందాల్సి ఉంది. అయితే.. చాలా మంది డీలర్లు అడ్డదారుల ద్వారా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ షాపులకు రాని లబ్ధిదారుల బియ్యాన్ని కాజేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. మిగిలిన బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి పంపకుండా అక్రమంగా విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారులకు ఆధార్ ఓటీపీ ద్వారా బియ్యాన్ని అందించినట్లు లెక్కల్లో చూపిస్తున్నట్లు సమాచారం. ఇందుకు ఆ లబ్ధిదారులకు కొంత సొమ్మును ముట్టజెప్పి దళారుల ద్వారా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరో వైపు కొందరు డీలర్లు దందా చేసే వాళ్లతో చేతులు కలిపి రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లాలోని మొగుళ్లపల్లి, చిట్యాల, టేకుమట్ల, గణపురం, భూపాలపల్లి, రేగొండ మండలాల్లో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. డీలర్లు ఇంత అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూడ్డం అనుమానాలకు తావిస్తోంది.



భూపాలపల్లి పట్టణంలోని రేషన్‌షాపులో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో మంగీలాల్ (ఫైల్)

ఆర్డీవో ఆదేశాలు బేఖాతరు

రేషన్‌షాపులకు వచ్చే బియ్యాన్ని లబ్ధిదారులకు డీలర్లు సక్రమంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. దీన్ని పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు నిత్యం పరిశీలిస్తూ ఉండాలి. షాపులకు వచ్చే బియ్యం సక్రమంగా లబ్ధిదారులకు అందుతోందా.. లేక అక్రమ మార్గాన దారి మళ్లుతోందా? అని అధికారులు ఆరా తీస్తూ ఉండాలి. ప్రతి

» మిగతా 8వ పేజీలో..

రేషన్ షాపుల్లో తనిఖీలకు చేస్తున్నాం

- శ్రీనాథ్, సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి



రేషన్‌షాపుల్లోకు వచ్చే స్టాక్‌పై ఎప్పటిప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నాం. అవకతవకలు ఉంటే కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల రేగొండ మండలంలో ఇద్దరు డీలర్లపై కేసులు నమోదు చేశాం. డీలర్లు అక్రమంగా రేషన్‌బియ్యాన్ని అమ్ముకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

కలెక్టర్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

మూడు నెలల్లో రెండోసారి

ములుగు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ములుగు కలెక్టర్ దివాకరను టార్గెట్ చేశారు. గడిచిన మూడునెలల కాలంలో రెండోసారి ఆయన పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను తెరిచారు. గురువారం పలువురు అధికారులకు, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపించారు. అక్సెప్ట్ చేసిన వారికి 'సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్న సుమిత్ కుమార్ అనే మిత్రుడు బదిలీపై వెళ్తున్నాడు.. అతను ఉపయోగించిన ఫర్నిచర్‌ను తక్కువ ధరకే ఇప్పిస్తా.. మీ ఫోన్ నెంబర్ పంపించండి..' అని మెస్సేజ్‌లు పంపించారు. కలెక్టర్ ఫొటో ఉండటంతో తొలుత ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అక్సెప్ట్ చేసిన వారు ఆతర్వాత వచ్చిన మెస్సేజ్‌లను చూసి ఇది ఫేక్ అని నిర్ధారించుకున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ దివాకర తన ఫాలోవర్లను అప్రమత్తం చేస్తూ సందేశం పంపించారు. ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా తన పేరిట ఎవరైనా డబ్బులు అడిగితే స్పందించొద్దని, వీలైనంత త్వరగా బ్లాక్ చేయాలని కోరారు. ఈవిషయమై సైబర్ క్రైమ్ పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు.

మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దు

సైబర్ నేరగాళ్లు తన పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలు సృష్టించారని, దీంతో పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు యత్నిస్తున్నారని, వారు పంపించే మోసపూరిత మెసేజ్‌లను ఎవరూ నమ్మొద్దని కలెక్టర్ దవాకర జిల్లా ప్రజలను కోరారు. నకిలీ ఖాతాను గమనించిన తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగినా ఇవ్వొద్దని సూచించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబర్ కేటుగాళ్ల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు.

కుటుంబాల గుర్తింపు 96 శాతం పూర్తి

ములుగు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. కుటుంబాల గుర్తింపు 96.24 శాతం పూర్తయ్యింది. 88,071 గృహాలకు గానూ 84,757గృహాలను సందర్శించిన ఎన్యుమరేటర్లు స్టిక్కరింగ్ చేశారు. సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని, వాస్తవాలతో కూడిన వివరాలను అందించాలని జిల్లా కలెకర్ దివాకర కోరారు.

భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సమగ్ర సర్వేలో భాగంగా జిల్లాలో కుటుంబాల గుర్తింపు ప్రక్రియ జిల్లాలో జోరుగా సాగుతోంది. జిల్లాలో మొత్తం 99,784 ఇళ్ల జాబితాను గుర్తించిన అధికారులు ఇంటింటి స్టిక్కరింగ్ చేశారు. శుక్రవారం ఇది పూర్తి కానుంది.

ఫటాఫట్

నకిలీ ఎరువుల కట్టడికి పటిష్ఠ చర్యలు

- వ్యవసాయ శాఖ భూపాలపల్లి జిల్లా అధికారి విజయభాస్కర్



ఆంధ్రజ్యోతి: యాసంగి యాక్షన్ ప్లాన్ ఏమిటి?

డీఏవో: జిల్లాకు యాసంగి ప్లాన్ సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలకు మొత్తం 1,14,572 ఎకరాల్లో అంచనా రూపొందించాం. గత యాసంగి కంటే ఈసారి 11,389 ఎకరాల్లో సాగు విస్తీర్ణం అచనా పెరిగింది.

ఆంధ్రజ్యోతి: నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువుల కట్టడి ఎలా ఉంది?

డీఏవో: యాసంగికి గానీ, ఖరీఫ్‌కు గానీ నాసిరకం విత్తనాలు, నకిలీ ఎరువుల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకోమారు తనిఖీలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రైతు భరోసా పథకం ఎలా అమలు కాబోతుంది?

డీఏవో: ఇందుకు ఇప్పటి వరకు మార్గదర్శకాలు రాలేదు. ఈ యాసంగికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని 1,16,220 మంది రైతులకు రైతుభరోసా కింద లబ్ధి చేకూరనుంది.

ఆంధ్రజ్యోతి: రైతులకు అవగాహన కార్యక్రమాలు ఎలా ఉన్నాయి?

డీఏవో: రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రతి మంగళవారం రైతునేస్తం పేరుతో ఆయా రైతువేదికల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆన్‌లైన్‌లో పంటల నమోదు ప్రక్రియ చేపట్టడంలేదని తెలుస్తోంది. మీరేమంటారు?

డీఏవో: ప్రతి పంటనూ ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తాం. క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నాం. సర్వే నంబర్లలో ఏమైనా సమస్యలుంటే ఆన్‌లైన్ నమోదు కాదు. అలాగే, కౌలు రైతుల వివరాలు సైతం ఆన్‌లైన్ జరగవు.

- భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి)

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. 15వ ఆర్థిక సంఘం, టీయూఎఫ్ఐడీసీ నిధులు సుమారు రూ.278 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవన్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, రేణుక, అనిల్, నాయకులు బుర్ర కొమురయ్య, బౌతు విజయ్‌కుమార్, ఉడుత మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె సంబంధిత అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఈనెల 17,18 తేదీల్లో జరుగనున్న పరీక్షకు 17 కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష పేపర్లను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సమావేశంలో గ్రూప్-3 పరీక్షపర్యవేక్షణ అధికారి వెంకన్న, కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

మల్హర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. మండలంలోని కొయ్యూర్‌లో సాగుతున్న సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ప్రతి ఇంటికీ ఎన్యుమరేటర్లు వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ప్రస్తుతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ముందుగా కుటుంబాలు, గృహాల సంఖ్య తదిత వివరాల సేకరణ జరుగుతోందని అన్నారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు 933 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, సూపర్‌వైజర్ కమల తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూర్‌లో స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

గత నిధులతోనే ఎమ్మెల్యే శంకుస్థాపనలు

మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో బీఆర్ఎస్ సర్కారు భూపాలపల్లికి మంజూరైన నిధులతో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేసిన శంకుస్థాపనలకే ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి ఆరోపించారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భూపాలపల్లి పట్టణాభివృద్ధికి వివిధ గ్రాంట్ల ద్వారా గత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రూ.310 కోట్ల నిధులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ప్రస్తుత ఎమ్మెల్యే ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తీసుకొచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇప్పటికే ప్రారంభమైన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలంతా ఈ విషయాల్ని గమనించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, నూనే రాజు, దార పూలమ్మ, మౌనిక, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

7వ పేజీలో..



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సత్యశారద, తదితరులు

అంతర్జాతీయ విమానాశ్రయంగా మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో యువతకు ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎయిర్‌పోర్టు సందర్శన



వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్ధన్నపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి హాజరు



భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరుగనున్న బీసీ రిజర్వేషన్లు
- ఇళ్లకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాటారం మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం





ఏటీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న టీజీఐఐసీ ఎండీ, కలెక్టర్, సబ్ కలెక్టర్

అత్యాధునిక శిక్షణనందించేందుకే ఏటీసీలు

టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐటీఐల విద్యార్థులకు అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో అత్యాధునిక శిక్షణ నందించడానికే రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల నిర్మాణం చేపట్టిందని టీజీఐఐసీ(రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ)ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కాటారం మండలకేంద్రంలోని సర్వే నెంబర్ 49లోని ఐటీఐ అప్‌గ్రేడ్‌లో భాగంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం చేయడానికి ఎకరం స్థలాన్ని అధికారులు కేటాయించారు. ఈ స్థలాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో నిర్మాణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అమలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఏటీసీ నిర్మాణం నాణ్యతతో పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తహసీల్దార్ నాగరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, ఆర్ఐ వెంకన్న పాల్గొన్నారు.

మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న రవికుమార్, తదితరులు

వాజేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మోడికుంట ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని గుమ్మడిదొడ్డిలో ఆ పార్టీ 9వ మండల మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మోడికుంట వాగుపై నిర్మించే ప్రాజెక్టు పెండింగ్‌లో ఉందని, ప్రాజెక్టు విశిష్టతను ఆనాడే సీపీఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య తెలిపారన్నారు. గత 25 సంవత్సరాలుగా మోడికుంట ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో మోడికుంట నిర్మాణంపై దశలవారీ ఉద్యమానికి రూపకల్పన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అంతకు ముందు పార్టీ జెండాను సీనియర్ నాయకురాలు తుమ్మ దేవేంద్ర ఆవిష్కరించారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యుడు బీరెడ్డి సాంబశివ, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ దావూద్, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దామోదర్, కృష్ణబాబు, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, నవంబర్ 7: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కల గుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

పేదల బియ్యం పక్కదారి!

- నర్సింహులపేట మండలంలో యథేచ్ఛగా దందా
- రేషన్ దుకాణాల నుంచి బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న వైనం
- నెలకు వెయ్యి క్వింటాళ్ల వరకు వ్యాపారుల పాలు
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి?
- డీలర్లు, అధికారులకు కాసుల వర్షం

నర్సింహులపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న పీడీఎస్ రైస్ రేషన్‌డీలర్లు, అధికారులు, వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కిలో రూ.6కు కొనుగోలు చేసి, దళారులకు రూ.10 నుంచి రూ.12కు విక్రయించి, జేబులు నింపుకొంటున్నారన్న ఆరోపణలున్నాయి. మండలంలోని రేషన్ డీలర్లు మూడు బృందాలుగా ఏర్పడి, సీనియర్ డీలర్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయాస్ అధికారులకు కమీషన్లు మాట్లాడి, గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ బియ్యం దందాలో ఓ ద్వితీయ స్థాయి పోలీస్ అధికారి తెరవెనకాల చక్రం తిప్పుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. నర్సింహులపేట మండలంలో 22 రేషన్ దుకాణాలకు గాను 9,100 కార్డులకు 1,600 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సరఫరా అవుతున్నాయి. ఇందులో 1,000 కింటాళ్ల రైస్ వరకు చీకటి దందాకు తరలుతున్నట్లు సమాచారం. ప్రధానంగా నర్సింహులపేట, పెద్దనాగారం, ముంగిమడుగు కేంద్రాలుగా ఏర్పడి బియ్యాన్ని రాత్రి వేళల్లో ఆటోలు, ఇతర రవాణా వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం.

లోపించిన పర్యవేక్షణ..

రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపంతో రేషన్ డీలర్ల బియ్యం దందాకు అడ్డులేకుండా పోతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. నెలసరి పంపిణీ అయ్యే బియ్యం కోటాలో ఎంతమేరకు కార్డుదారులకు ఇస్తున్నారు, ఎంత అక్రమంగా అమ్ముతున్నారో తెలియని దుస్థితి నెలకొన్నది. గతంలో రేషన్ షాపులను ప్రతీ మూడు మాసాలకు ఒకసారి రెవెన్యూ అధికారులు సందర్శించి పంపిణీ.. స్టాక్ నిల్వలను పరిశీలించేవారు. అయినా నెలసరి వేలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుంటే, ఏ అధికారి పటించుకొకపోవడంలో ఆంతర్య మేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం



పేద ప్రజలకు పంపిణీ చేయాల్సి రేషన్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. రేషన్ డీలర్లు బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా, రిటన్‌గా కేజీకి రూ.6 చొప్పున ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ నిఘాను పెంచి బాధ్యులపై 6ఏ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

\- గణేష్, ఆర్డీవో తొర్రూరు



నర్సింహులపేట మండలం నుంచి అర్ధరాతి వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

చక్రం తిప్పుతున్న ఓ అధికారి..

మండల రేషన్ డీలర్లకు, సూర్యాపేట జిల్లాకు చెందిన బియ్యం వ్యాపారితో చీకటి ఒప్పందం కుదుర్చుకొన్న ఓ పోలీస్ అధికారి చక్రం తిప్పుతూ దందాలో పరోక్షంగా పాల్గొంటూ జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ చీకటి దందా ఒప్పందాలపై ఇటీవల నిఘా అధికారులు ఆరా తీసి క్షేత్రస్థాయి నివేదికను జిల్లా పోలీసు బాస్‌కు అందజేసినట్లు సమాచారం.

కాసుల వర్షం..

రేషన్ బియ్యం దందాలో పోలీస్, రెవెన్యూ, సివిల్ సప్లయాస్ అధికారులతో పాటు రేషన్ డీలర్లకు కాసుల వర్షం కురుస్తున్నట్లు ప్రజలు నుంచి ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని బాధితుల నుంచి కేజీ రూ.6 కొనుగోలు చేసి చీకటీ దందా వ్యాపారులకు రూ. 10 నుంచి రూ.12 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన నెలనెల రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం.

నెల రోజులైనా గింజ కూడా కొనుగోలు చేయలే

కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను ఆగం చేస్తోంది

నమ్మకం లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులైనా ప్రభుత్వం ఒక్క గింజ కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదని, ప్రభుత్వం నమ్మకం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం వర్ధన్నపేట మండలం రాంధాన్‌తండా నుంచి వెళ్తూ ఇల్లంద గ్రామ సమీపంలోని ఓ పొలం వద్ద ఆగిన ఆయన అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎదుట పలువురు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. పంటకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వకపోగా కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పథకాల అమలు మాట దేవుడెరుగు గానీ, పాత పథకాలైన రైతుబంధు నిలిపివేసి రుణమాఫీ ఎగ్గొటిందని, ఈ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేకపోవడంతో తాము ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలవుతున్నా ఒక్క గింజను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తే ఈ ప్రభుత్వం తడిచిన ధాన్యమని, తేమ శాతం ఎక్కువ ఉందని కొర్రీలు పెడుతూ రైతులను ఆగం చేస్తోందన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలుచేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, మద్దతు ధరతోపాటు బోనస్‌ను కూడా ఇవ్వాలని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు అనిమిరెడ్డి రాజమల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నముప్పారంలో

వీధికుక్కల స్వైరవిహారం

ఒక్క రోజే ముగ్గురిపై దాడి

ఇనుగుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలం చిన్నముప్పారంలో గురువారం వీధికుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామంలో విద్యుత్ బిల్లులు జారీ చేసే సిబ్బంది ఎడ్లోజు రాజశేఖర్‌తోపాటు ఇదే గ్రామానికి చెందిన ముంజంపల్లి పూలమ్మ, కాలేరు హరీష్‌లను వీధి కుక్కలు వేర్వేరు ప్రాంతాల్లో కరిచాయి. గాయపడిన వారు ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. అయితే కుక్క కాటు వైద్యానికి సంబంధించిన మొదటి డోసు ఇంజక్షన్ మాత్రం ఇనుగుర్తి పీహెచ్‌సీలో ఇవ్వగా మిగతా డోసులు మాత్రం నెల్లికుదురు పీహెచ్‌సీలో తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించినట్లు బాధితులు తెలిపారు. చిన్నముప్పారం గ్రామం నెల్లికుదురు పీహెచ్‌సీ పరిధిలో ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఒకే రోజు ముగ్గురిని కుక్కలు కరవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కుక్కలను వెంటనే నివారించి ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అనుమతి ఉన్న మందులనే విక్రయించాలి

ఏఈడీ అజ్మీర శ్రీనివాసరావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ప్రభుత్వ అనుమతి ఉన్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని మహబూబాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసరావు సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని రైతు మిత్ర అగ్రిమాల్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను, పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డితో సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని చెప్పారు. ఎరువుల లైసెన్స్‌ల్లో వివిధ కంపెనీలకు సంబంధించిన జీరో ఫారంలో చేర్చాలని చెప్పారు. ఎరువులు వచ్చిన వెంటనే ఈపాస్ మిషన్‌లో నమోదు చేసి రైతు ఆధార్‌కార్డు ద్వారానే విక్రయించాలని తెలిపారు.

వడ్ల కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు: ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెంలోని రైతు వేదికలో పీపీసీ సెంటర్ ఇన్‌చార్జులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లకు, రైతులకు గురువారం ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు ఆరబెట్టి శుభ్రంచేసి తీసుకురావాన్నారు. 17 లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు.



మహబూబాబాద్‌లోని ఎరువుల దుకాణాన్ని తనిఖీల చేస్తున్న శ్రీనివాసరావు

మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్, ఇన్‌చార్జి తహసీల్దార్ కోమల, ఐకేపీ ఏపీఎం రవీందర్, ఏఈవోలు, సొసైటీ కార్యదర్శి, గిరిజన కోఆపరేటివ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కొమ్మకుళ్లు తెగులును ఆదిలోనే అరికట్టాలి



మల్యాలలో మిర్చి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిర్చి, టమాట తోటలకు కోనోపొర కొమ్మకుళ్ల తెగులు వ్యాప్తి చెందుతుందని వాటిని ఆదిలోనే అరికట్టాలని మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి నాగరాజు తెలిపారు. మహబూబాబాద్ మండలంలోని మల్యాలలో మిర్చి, టమాట తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి తోటల్లో కొమ్మకుళ్ల తెగులు, లద్దె పురుగు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. తొలి దశలోనే వాటికి సరైన మందులు వాడుతూ క్షేత్ర పరిశుభ్రత పాటిస్తే తెగుళ్ల ద్వార వచ్చే నష్టాన్ని అరికట్టగలమని తెలిపారు. ఈ కొమ్మకుళ్ల తెగులు నివారణ ప్రొపి కొనోజోల్ లీటర్ నీటికి అర ఎంఎల్ లేదా, ఎక్స్ కొనోజోల్ ఒక లీటర్‌కు అర మిల్లిలీటర్ కలిపి పిచికారి చేయాలని తెలిపారు. టమాట కాయ తొలిచే పురుగు నివారణకు హిమామెక్టిన్ బెంజోయెట్ 10 లీటర్ల నీటికి నాలుగు మిల్లిలీటర్ల మందు కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే తోటలో లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మానుకోట ఇంచార్జ్ డీడబ్ల్యూవోగా శిరీష

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ఇంచార్జ్ సంక్షేమ అధికారిగా స్థానిక సీడీపీవో శిరీష గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీడబ్ల్యూవోగా పనిచేసిన వరలక్ష్మి అక్టోబర్ 30న పదవీవిరమణ పొందారు. ఆమె స్థానంలో సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న శిరీషకు అదనంగా డీడబ్ల్యూవోగా బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఇంచార్జ్ డీడబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించిన శిరీషను బీఆర్‌టీయూ అంగన్‌వాడీ హెల్పర్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షురాలు గుండు సులోచన, కార్యదర్శి హేమ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుజాత, సునిత, సరస్వతి, జయమ్మ పాల్గొన్నారు.

రామప్ప కాలువలతో పరేషాన్..!

- చెరువులు,కుంటల నుంచి వృథాగా పోతున్న సాగునీరు
- నీటి నిలువలకు యాసంగిలో ఇక్కట్లు
- మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్

వెంకటాపూర్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి): వానలతో నిండుకున్న నీటి వనరులను కాపాడుకోవడం యాసంగి సాగులో ముఖ్యం. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలతోపాటు కాకతీయులు నిర్మించిన రామప్ప సరస్సు సైతం నిండుకోవడంతో రైతులు కొంత సంబరపడ్డారు. కానీ, రామప్ప సరస్సు కింద ఉన్న కాలువలైన కొత్తకాలువ, వీర్ల కాలువ, ఒగరుకాలువ, బూర్గుకాలువ, సోమికాలువలతోపాటు తదితర చెరువుల కాలువలు పాడవ్వడంతో నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యాసంగిలో వరిపంట సాగు చేసుకునేందుకు కుంటలు, చెరువుల్లో ఉన్న నీరే ఆధారం. వర్షాకాలంలో సరైన సమయంలో వానలు కురువకపోవడంతో చాలా మంది రైతులు వరిసాగుకు వెనకడుగు వేశారు. సీజన్ చివర్లో సమృద్ధిగా వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలతోపాటు రామప్ప చెరువు కూడా నిండుకుండల్లా మారాయి. వాటిలో కొన్ని చెరువులు, కుంటలు అలుగు కూడా పడ్డాయి. చెరువులు, కుంటలు నిండకుండల్లా ఉన్న నీటిని చూసి రైతులు యాసంగి సాగుపై ఆశ పెంచుకున్నారు. ప్రస్తుతం కుంటలు, చెరువుల్లో నీరు వృథా కాకుండా నిలువ ఉంటేనే వేసవిలో ఉపయోగపడుతాయి.

కోత సమయంలో తిప్పలు

మండల పరిధిలోని గ్రామాల్లో గల చెరువులు, కుంటలు ఇటీవల కురిసిన వర్షాలకు నిండినా ప్రస్తుతం కాలువలు సరిగా లేకపోవడంతో నీరు వృథా అవుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. రామప్ప చెరువు కింద సాగు చేసిన వర్షకాలం పంటలు కోతకు వచ్చాయి. చెరువు నుంచి వస్తున్న నీరు కాలువలు సరిగా లేకపోవడంతో పంట కోయడానికి సిద్ధంగా ఉన్న భూములు బురదమయంగా మారుతున్నట్లు రైతులు వాపోతున్నారు. రామప్ప చెరువు కింద సూమారు 10 వేల ఎకరాల మేర ఆయకట్టు ఉంటుందని రైతులు తెలిపారు. రామప్ప చెరువులో నీరు నిండుగా ఉంటే యాసంగి వరి సాగుకు ఉపయుక్తంగా ఉంటుంది. రైతుల కష్టాలను అధికార యంత్రాంగం దృష్టిలో ఉంచుకుని కాలువలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



రామప్ప ప్రధాన కాలువల్లో మొలిచిన పిచ్చిమొక్కలు

నకిలీ వైద్యులతో జాగ్రత్తగా ఉండాలి

వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా



వివరాలు తెలుసుకుంటున్న కమిటీ బృందం

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యులు కాదని, ప్రజలు తెలిసీతెలియక వారి వద్దకెళ్లి చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా సూచించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనుకుంట తండాకు చెందిన బానోతు ఐశ్వర్య (16)కు హరిపిరాల కు చెందిన నకిలీ వైద్యుడు చెన్నా సారయ్య వైద్యం చేయడంతో గత నెల 25న మృతిచెందారు. ఈ ఘటనపై సుమోటా తీసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ లీగల్, యాంటీ క్వాకరీ కమిటీ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ శిరీష్, సభ్యులు డాక్టర్ తిరేష్‌లతో కూడిన బృందం గురువారం విచారణ చేపట్టింది.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలో చట్టవిరుద్ధంగా ఎలాంటి అర్హత లేకుండా నకిలీ వైద్యుడు చెన్న సారయ్య నిర్వహిస్తున్న సెంటరును తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సారయ్యకు వైద్య పరంగా ఎలాంటి విద్యార్హత లేదని, కనీసం పదో తరగతి కూడా పాస్ కాకుండానే ఆర్ఎంపీగా అవతారం ఎత్తినట్లు పేర్కొన్నారు. సారయ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఫార్మసిస్టు లేకుండా సాయిరామ్ మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు కూడా విక్రయిస్తున్నట్లు తెలిపారు. సారయ్యకు ఫార్మసీ సర్టిఫికెట్ ఇచ్చిన గజవెల్లి స్వాతిపై చర్యలు తీసుకోవాలని ఫార్మసీ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం తండాలోని మృతురాలి ఇంటికి వెళ్లిన బృందం కుటుంబసభ్యులను బృందం పరామర్శించింది. నకిలీ వైద్యులు సారయ్య ఇచ్చిన ఇంజక్షన్ వల్లనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు విచారణ బృందంతో చెప్పి కన్నీటి పర్యంతం అయినట్లు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు (బిల్టీ రకం)	2334	2080
పల్లికాయ (సూక)	5000	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	7712	6550
పెసళ్లు	6912	4052
పత్తి	6910	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	10069	10450
పసుపు (గోల)	10027	90250
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16200	12000
వండర్‌హాట్ ఏసీ	14000	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	7000	3000

\- వరంగల్ వ్యవసాయం


చింతల శివకృష్ణ


నూకల అనిల్


తిక్క వినోద్


బండి ప్రశాంత్


నల్లపు అనిల్ (ఆర్మీ)


యూ వెంకటేశ్వర్లు, (ఆర్మీ)


యాసం ప్రశాంత్ (సీఐఎస్ఎఫ్)


కన్నెబోయిన కుమార్ (ఆర్మీ)

దేశ సేవలో.. రైతు బిడ్డలు

- పుట్టింది పూరి గుడిసెల్లో.. చేరింది సైన్యంలో..
- ఒకే ఊరి నుంచి ఏడుగురు సైనికులు
- మాతృభూమిపై మమకారంతో ముందుకొస్తున్న యువకులు
- పుట్టిన గ్రామం, అయిన వారిని వదిలి దేశం కోసం సేవ
- త్రివిధ దళాల్లో సీతారాంపురం, అప్పలరావుపేట యువత


ఇష్టబోయిన నరేష్ యాదవ్


ఇష్టబోయిన రమేష్ యాదవ్


బండి తిరుపతి

పరకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నింగి అంచున రెపరెపలాడుతున్న ఓ త్రివర్ణ పతాకమా నీ సంతోషానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తే ఇదిగో నా సైనికుల గుండెలపై మోస్తున్న జెండా అంటూ బదులిచ్చింది. పుట్టింది పూరి గుడిసెల్లో అయినా మాతృభూమిపై మమకారంతో పుట్టిన ఊరు, అయిన వారిని వదిలి ఏళ్ల తరబడి దేశ రక్షణకు అంకితమయ్యారు. ఆ యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. హనుమకొండ జిల్లా పరకాల మునిసిపల్ విలీన గ్రామం సీతారాంపురానికి చెందిన ఇష్టబోయిన రమేశ్, తిక్క వినోద్, బండి తిరుపతి, ఇష్టబోయిన నరేశ్, నూకల అనిల్, చింతల శివకృష్ణ, బండి ప్రశాంత్ (సీఆర్‌పీఎఫ్)కు ఒకే ఊరి నుంచి ఏడుగురు జవాన్లుగా ఎంపికయ్యారు. ఇందులో కొందరు తండ్రిని కోల్పోయి తల్లుల ఆసరాతోనే దేశ సేవ కోసం ముందడుగు వేశారు. అందరూ రైతు బిడ్డలే. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించేవారే.

ఇందులో చింతల శివకృష్ణ కుటుంబం పేదరికంలో ఉండేది. ఒకసారి గాలివానకు ఊరు చివర వేసుకున్న పాక కొట్టుకపోయింది. కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో తల దాచుకున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఓ వైపు అప్పులు మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో కాలం వెళ్లదీసే కుటుంబాలే. బండి రవి- సులోచన దంపతుల కుమారులు తిరుపతి, ప్రశాంత్. రవి తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తూ అలాగే వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అనుకోకుండా రవి మృతితో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భర్త చనిపోయినా సులోచన ధైర్యం కోల్పోకుండా పట్టుదలతో ఇద్దరి కుమారులను దేశ సేవ కోసం సైన్యంలోకి పంపించింది. అదేవిధంగా నూకల కొమురయ్య కుమారుడు అనిల్ చాలా కష్టపడి సీఆర్పీఎఫ్‌లో ఉద్యోగం సంపాదించాడు. తన తండ్రి తమ గొర్లను కాస్తూ వ్యవసాయం చేసేవాడు. తను కూడా అకాల మరణంతో అనిల్ కృంగిపోకుండా దేశ సేవ చేయాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. నిరుపేద కుటుంబాల పిల్లలే నేడు సైనికుల్లా మారారు.

దేశ రక్షణకు అంకితం..

దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరిన యువకులకు నేటికి ఇబ్బందులు తప్పడం లేదు. సరిహద్దుల్లో ప్రాణాలను లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఏళ్ల తరబడి కన్నవారిని, పుట్టిన గ్రామాన్ని వదిలి సేవ చేస్తున్నారు. ఇందులో ఒక్కరిద్దరికి పెళ్లయినా భార్య పిల్లలను వదిలి దేశ రక్షణ కోసం వెళ్లారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి దేశ సేవ చేస్తున్న యువకులది మా ఊరు అంటూ చెప్పుకొని ఆ గ్రామం నేడు గర్విస్తోంది. అంతే కాకుండా గ్రామానికి చెందిన ఇష్టబోయిన సురేశ్ ఎస్ఐగా ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

అడప రాజు కానిస్టేబుల్‌గా.. ఇలా గ్రామం నుంచి పోలీసు సేవలు అందించడం సీతారాంపురం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది.

తల్లిగా గర్వపడుతున్నా..



బండి సులోచన, సీతారాంపురం

భర్త చనిపోయినా ధైర్యం కోల్పోలేదు. పిల్లలను దేశ రక్షణలో చేర్పించాలని ఒక సంకల్పంతో ముందుకు సాగా. అడ్డంకులు, ఇబ్బందులు వచ్చినా ఇద్దరు కుమారులు పట్టుదలతో సైనికులై దేశ సేవ చేస్తున్నారు. నాకు చాలా గర్వంగా ఉంది.

మా ఊరు నుంచే ఎక్కువ మంది సైనికులు



నల్లెల్ల జ్యోతి, కౌన్సిలర్

మా ఊరు సీతారాంపురం నుంచే దేశ రక్షణ కోసం ఏడుగురు జవాన్లు ఎంపికయ్యారు. దేశ సేవ చేయడం చాలా సంతోషంగా ఉంది. అందులో మా బంధువులు కూడా ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మరి కొంత మంది యువకులు సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు.

ఆదర్శం

నెక్కొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యావంతులు ఆర్థికంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని జన్మభూమిని వదిలి 70 శాతం మంది విదేశాలకు వెళ్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామ యువకులు దేశ సేవ కోసం ఆర్మీలో చేరి ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లలు ఆర్మీలో చేరడానికి తల్లిదండ్రులు అడ్డు చెప్పకపోగా జన్మభూమికి సేవచేసే భాగ్యం అందరికి దొరకదంటూ ప్రోత్సహిస్తు న్నారు. గతంలో గ్రామంలో యువత వ్యవసాయం తో పాటు కులవృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునేవారు. ప్రభుత్వం ఉద్యోగం అంటే ఏమిటో తెలియని ఆ గ్రామం నుంచి ఏకంగా దేశరక్షణ కోసం వీధికొక్కరు ఎంపికయ్యారు. ఈ ఒక్క గ్రా మం నుంచే ఇరవై మందికి పైగా త్రివిధ దళాలైన ఇండియన్ ఆర్మీ, నావికదళం, ఎయిర్‌ఫోర్స్‌లో విధు లు నిర్వర్తిస్తున్నారు. మండల ప్రజల నుంచి అభినందనలు అందుకుంటున్నారు.

ఆర్మీలో చేరుతున్న యువత

నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏటా గ్రామానికి చెందిన యువకులు సైన్యంలో చేరుతున్నారు. ఇప్పటి వరకు ఇరవై మందికి పైగా రక్షణ విభాగంలోని అనేక శాఖల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. యువత సైన్యంలో చేరుతుండడంతో అప్పల్‌రావుపేట గ్రామానికి జిల్లాలో మంచి గుర్తింపు వస్తుంది.


అప్పల్‌రావుపేట

సైన్యంలోనే కాకుండా పోలీసు శాఖలో సైతం పలువురు విధులు నిర్వహిస్తున్నారు. యువత సైన్యంలో చేరాలంటూ ఆర్మీలో విధులను నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రోత్సహిస్తున్నారు.

ఆర్మీ వీరులు వీరే..

ఆర్మీల్లో 18 సంవత్సరాల నుంచి ఊడుగుల సంతోష్, మడత రాజ్‌కుమార్, ఊడుగుల వెంకటేశ్వర్లు, ముత్తినేని శివ, నల్లపు అనిల్, కన్నెబోయిన కుమార్, మురారిశెట్టి రాజులు విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐఎస్ఎఫ్‌లో బోళ్ల అనిల్, యాసం ప్రశాంత్, మహ్మద్ రహీంపాషా, బోళ్ల అరుణ్, కొయ్యడి అఖిల్, నావిక దళంలో బేర మణికృష్ణ, ఎయిర్‌ఫోర్స్‌లో అక్కల అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు.


బోళ్ల అరుణ్ (సీఐఎస్ఎఫ్)

ఒకే కుటుంబంలో పోలీసులుగా..

ఈ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన తిప్పని చంద్రశేఖర్, తిప్పని శ్రావణ్, తిప్పని రంజిత్ కుమార్, తిప్పని అరుణ్‌కుమార్ విధులు నిర్వర్తించడం విశేషం. అలాగే మడత సృజన, మాలి సురేష్ కూడా పోలీసు శాఖలో పని చేస్తున్నారు.


మడత సృజన (పీసీ)

మొదట సైన్యంలో చేరిన మైబూబ్‌పాషా, శ్రీధర్


మైబుబ్‌పాషా (బీఎస్ఎఫ్)

సైనిక ఉద్యోగం అంటే భయపడుతున్న రోజుల్లో ఇదే గ్రామానికి చెందిన మైబూబ్‌పాషా బీఎస్ఎఫ్, ఊడుగుల శ్రీధర్ 2001 సంవత్సరంలో ఆర్మీల్లో చేరారు. ఇద్దరు యువకులు ధైర్యంగా ముందడుగు వేయడంతో యువతకు దేశరక్షణలో సేవలందించాలనే ఆసక్తి కల్గింది. అప్పటివరకూ ఆర్మీలో చేరాలంటే ఉన్న భయాన్ని యువత, వారి తల్లిదండ్రుల్లో పారదోలి ఆదర్శంగా నిలిచారు.


ఊడుగుల శ్రీధర్ (ఆర్మీ)

అంతర్జాతీయ విమానాశ్రయంగా మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలతో ఎయిర్‌పోర్టు సందర్శన

శంభునిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిలో ఎంతో కీలకమైన మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామని, ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదలతో కలిసి ఆమె గురువారం మామునూరు విమానాశ్రయాన్ని పరిశీలించారు. భూసేకరణ గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోతున్న నక్కలపల్లి, గాడెపల్లి, గుంటూరుపల్లి గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. మామునూరు విమానాశ్రయం కోసం 253 ఎకరాల భూమి అవసరం ఉండగా, ఆ భూముల యజమానులు 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు.

చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్‌లో పర్యాటకపరంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్కు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు పలు పరిశ్రమలు ఉండటం వలన ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్లలోపు ఉన్న వరంగల్‌లో ఎయిర్‌పోర్టు కుదరదని చెప్పినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థను ఒప్పించారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరఫున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులను, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపి అభినందించారు. రైతులకు, పాట్ల యజమానులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. అందుకు కావాల్సిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కావాల్సిన మ్యాపింగ్, పరిహారం చెల్లింపు సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్ సత్యశారదను మంత్రి సురేఖ ఆదేశించారు.


అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రవాణా వ్యవస్థ మెరుగుపడాలన్నారు. అందుకు అణుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనితోపాటు నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేలైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులకు భూములు త్యాగం చేసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన నిధులను సీఎం ద్వారా మంత్రి కొండా సురేఖతో కలిసి మంజూరు చేయిస్తామని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నగర ప్రజల కల అయిన ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో నగర రూపురేఖలు మారుతాయన్నారు. నగర అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఓరుగల్లు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగ్‌రోడ్, ఓఆర్ఆర్, అండర్ డ్రైనేజీ నిర్మాణాలతో వరంగల్ ప్రపంచ శ్రేణి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులను సంతృప్తి పరిచి వారి అంగీకారం మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని, ప్రస్తుతం ఉన్న భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేయించి మ్యాపింగ్ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు, రైతులు కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ, బైరబోయిన ఉమదామోదర్ యాదవ్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, భోగి సువర్ణ -సురేష్, ముష్కమల్ల అరుణ, ఓని స్వర్ణలత, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ఫుర్ఖాన్, టీపీసీసీ సెక్రెటరీ మీసాల ప్రకాశ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ జితేందర్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధకారులు, సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏఎంసీ ప్రమాణ స్వీకారానికి హాజరు

వర్ధన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో అమృత్ పథకాలకు సంబంధించిన శిలాఫలకాలకు, మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామాల్లో నడిబొడ్డున గ్రామ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తిస్తామని పేర్కొన్నారు. రుణమాఫీకాని రైతులకు సాంకేతిక లోపాలు తొలగించి డిసెంబర్ చివరి నాటికి వారి ఖాతాలో డబ్బులు జమ చేయనున్నామన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులను ఆదుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, సభకు హాజరైన ప్రజలు

దేశ చరిత్రలోనే రూ.31వేల కోట్లు రైతుల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అన్నారు. కారు కూతలు కూసిన ప్రతిపక్ష నేతలు టైరు కింద తలకాయ పెడతారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలన్నీ గులాబీ రంగు చొక్కా వేసుకున్న వారికే చెందాయని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున పక్కా గృహాలను మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ ఐదేళ్లలో అర్హులైన వారందరికీ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరయ్యే విధంగా, అన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగపడేలా ఒక్కో కుటుంబానికి ఒక స్మార్ట్ కార్డును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు చెప్పిన, చెప్పని అంశాలు, అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

అనంతరం వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నరుకుడు వెంకటయ్య, డైరెక్టర్లతో సభా వేదికపై ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గానికి అదనంగా మరో 1,500 గృహాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ సుధీర్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, పిన్నింటి అనిల్‌రావు, ఎద్దు సత్యనారాయణ, మైస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
- సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర అందేలా సర్కారు కృషి చేస్తోందని తెలిపారు. మండలంలో ఆయన గురువారం పర్యటించారు. కాటారంలోని మీనాక్షి, చల్లపల్లిలోని రుద్ర జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. రైతులు ట్రాక్టర్లలో తెచ్చిన పత్తిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడులు, దిగుబడులు, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. మీనాక్షి జిన్నింగ్ మిల్లులో పత్తి జిన్నింగ్ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ దేశంలో పత్తి దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయన్నారు. నాణ్యమైన పత్తి లక్షలాది టన్నుల నిల్వలున్నా కేంద్రం విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. కేంద్రం పత్తి దిగుమతులు నిలిపేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సీసీఐ ద్వారా పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చెల్లిస్తున్నా తేమ శాతం పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సీసీఐ కేంద్రాల నిర్వాహకులు పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. వడ్ల కొనుగోళ్ల కోసం పీపీసీల ప్రారంభం జరుగుతుందన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందన్నారు.


కాటారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మిల్లర్లు తేమ, తాలు పేరిట కటింగ్ చేస్తే సహించేది లేదన్నారు. రైతులు వడ్లను శుభ్రపరిచి ఆర బెట్టి కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర అందుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)అశోక్ కుమార్, డీసీఎస్‌వో శ్రీనాథ్, సివిల్ సప్లయ్ డీఎం రాములు, డీసీవో వాల్యానాయక్, డీఎంవో కనకశేఖర్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీపీవో ఇలంగోన్, మిల్లర్లు సాగర్‌రెడ్డి, శివకుమార్, సాంబిరెడ్డి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరుగనున్న బీసీ రిజర్వేషన్లు
- అధికారులకు ప్రజలు సహకరించాలి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన ఇంటింటి కుటుంబ సర్వే తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సామల లింగమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని పలు విధుల్లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


గట్లనర్సింగాపూర్‌లో కూరగాయలు అమ్మే మహిళతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అలాగే గట్లనర్సింగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కులగణన సర్వేను పరిశీలించారు. కుల గణనపై అధికారులకు సమగ్ర వివరాలు ఇవ్వాలని, సమాచారం గోప్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, కూరగాయలు అమ్ముతున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో 1.17 కోట్ల ఇళ్లపై సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం 87వేల మంది ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. ప్రస్తుతం ఇళ్లకు సర్వేలో స్టిక్కరింగ్ జరుగుతుందన్నారు. సర్వే ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

ప్రధాని కులాన్ని అడిగామా ?

'ప్రధాని నరేంద్రమోదీ ఏం కులమో తాము అడిగామా..? రాహుల్‌గాంధీ కులాన్ని అడిగేందుకు బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎవరు' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో పాద యాత్ర నిర్వహించిన సందర్భంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని ప్రకటించారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కుల గణన చేస్తుంటే బీజేపీ పార్టీ అక్కసును వెళ్లగక్కుతోందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణనకు బీజేపీ పార్టీ వ్యతిరేకమన్నారు. రాహుల్‌గాంధీ కులాన్ని ప్రశ్నించడం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వ్యక్తిగతమా..? లేక బీజేపీ సిద్ధాంతమా..? తెలపాలని పొన్నం ప్రశ్నించారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుద్ధి, జ్ఞానం లేని వాళ్లు రాహుల్‌గాంధీ కులం గురించి ప్రశ్నిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేస్తే ఎవరి కులం ఏమిటో బయట పడుతుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణనకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఏఎస్‌వో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, నాయకులు పిడిశెట్టి కనకయ్య, ఎదులాపురం తిరుపతి, పొన్నాల మురళీ పటేల్, బీపీటీ అయిలయ్య, పోచయ్య, నాగరాజు, చెప్యాల ప్రకాష్, స్వర్ణలత, కంకల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి తగిన గుర్తింపు

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఆత్మీయ సన్మానం



ప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో క్రమశిక్షణతో కష్టపడేవారికి తగిన గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో గాండ్ల(రెడ్డిగాండ్ల)సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డికి ఆత్మీయ సన్మానం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి వేలాది మందితో ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డిగాండ్ల సంఘం నాయకులు క్రేన్ ద్వారా గజమాలతో మంత్రిని, ఇతర అతిథులను సత్కరించారు. సభలో ఐత ప్రకాష్‌రెడ్డిని మంత్రి శ్రీధర్‌బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశ్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా పార్టీలో పనిచేస్తున్నారని, కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి నేడు రాష్ట్ర స్థాయి పదవిని దక్కించుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఓపికతో ఉండి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు. పని చేసేవారికి కాంగ్రెస్‌లో తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. అనంతరం కొత్తపల్లిలో వాటర్ బాట్లింగ్ యూనిట్, శ్రీపాదకాలనీ కమాన్‌బోర్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగాండ్ల సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, జక్కిరెడ్డి, రమేష్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీని వాస్‌రెడ్డి, రాజిరెడ్డి, మాధవరెడ్డి, సమ్మిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతులు

మండలంలో పర్యటించిన మంత్రి శ్రీధర్‌బాబుకు పలు సంఘాల నేతలతోపాటు ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. విద్యుత్‌శాఖ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ నాయకులు తమను ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎంసీ హాస్టల్, గురుకులాలకు భవనాలు నిర్మాణం చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు స్మరణ్ విన్నవించారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

మల్హర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది కలగకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని కొండంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్ అర్హులైన ప్రతి రైతుకూ అందేలా చూడాలన్నారు. రైస్ మిల్లర్లు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ ప్రకాష్‌రావు, డైరెక్టర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పోలీసుల అదుపులో గుప్తనిధుల నిందితులు?

వెంకటాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం పరిసరాల్లో ఉన్న గొల్లాల గుడిని గుప్తనిధుల కోసం ధ్వంసం చేసిన నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది. సెప్టెంబరు 23న అర్ధరాత్రి నిందితులు గొల్లాలగుడిలోకి ప్రవేశించి పైకప్పును తొలగించారు. అంతటితో ఆగక గుప్తనిధులు లభిస్తాయనే ఆశతో తవ్వకాలు చేపట్టారు. పురాతన విగ్రహాలైన శివలింగంతోపాటు ఇతర విగ్రహాలను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి నిందితులను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. చేపట్టిన విచారణ ఆధా రంగా ఏడుగురు నిందితులు ఈఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. వెంకటాపూర్ మం డలంలోని గుర్రంపేట గ్రామానికి చెందిన వ్యక్తితోపాటు నర్సంపేట పట్టణానికి చెందిన మరో వ్యక్తి, భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం, చింతకాని గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులను నిందితులుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

వీరిలో నలుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. పరారీ లో ఉన్న మిగతా ముగ్గురిని అదుపు లోకి తీసుకున్నాక నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

భక్తులకు అసౌకర్యం కలగకుండా జాతర పనులు

డీపీవో నారాయణ

రేగొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలగిరి గ్రామశివారులో జరిగే బుగులోని వెంకటేశ్వరస్వామి జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని డీపీవో నారాయణ తెలిపారు. గురువారం బుగులోని జాతరను ఇతర అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాతర ప్రాముఖ్యత, ప్రతి ఏడాది కలుగుతున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ రహదారుల వెంట పిచ్చిమొక్కల తొలగింపు, జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపడుతామని అన్నారు. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీఈ శ్వేత, తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈవో శ్రీనివాస్, జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, పంచాయితీ కార్యదర్శి మమత, నాయకులు నిమ్మల విజేందర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో హైకోర్టు జడ్జి



త్రివేణి సంగమానికి వెళ్తున్న జడ్జి

మహదేవపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీదేవి గురువారం సందర్శించారు. తన తండ్రి జువ్వాడి సూర్యరావు అస్తికలను త్రివేణి సంగమం వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు. వేద పండితులతో అస్తికలకు సంప్రోక్షణ చేసి త్రివేణి సంగమంలో నిమజ్జనం చేశారు భూపలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, మహదేవపూర్, కాళేశ్వరం ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ రీల్

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణనను పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలోని కాటారం, ధన్వాడ జీపీల పరిధిలో గురువారం సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్, స్టిక్కరింగ్ ప్రక్రియలను ఆమె పర్యవే క్షించారు. మండల వ్యాప్తంగా ఉన్న కుటుంబాలు, సర్వే ప్రక్రియ జరుగు తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, కార్యద ర్శులు సమీర్‌ఖాన్, ఉమాదేవి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

మొరం తవ్వుతున్న ఎక్స్‌కావేటర్ సీజ్

వెంకటాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకన్నగూడెం గ్రామశివారు ప్రభుత్వ భూమిలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కావేటర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో జేసీబీతో మొరం తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని అన్నారు. దీంతో జేసీబీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని, వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక



రిషిక

ములుగు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల జరిగిన అండర్ -17 విభాగం ఖో-ఖోలో ములుగు మండలంలోని జంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువు తున్న విద్యార్థిని అజ్మీరా రిషిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈసందర్భంగా పాఠశాలలో గురు వారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సామల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థిని రిషికను అభినందించారు. ఈనెల 8నుంచి 10 వరకు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్రస్థాయిలో ఖో-ఖో పోటీల్లో రిషిక పాల్గొననుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

వాజేడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలో గురువారం మండలంలోని జగన్నాథపురం, కొప్పుసూరులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జీసీసీ మేనేజరు స్వామి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. ఏ గ్రేడు రకం క్వింటాకు రూ . 2,320, కామన్ రకానికి రూ. 2,300, అదేవిధంగా సన్న ధాన్యానికి రూ. 500ను ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ రాంబాబు, సెంటర్ ఇంచార్జిలు చంద్రకళ, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్లను దళారుల పాలు చేయొద్దు

ములుగు డీపీఎం గోవింద్‌చౌహాన్

వెంకటాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయొద్దని, ప్రభు త్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ములుగు ఐకేపీ డీపీఎం గోవింద్ చౌహాన్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తాళ్లపాడు సమీపంలోని స్పార్క్ డెవలపర్స్ ప్లాట్లల్లో చందన గ్రామైక్య సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గోవింద్‌చౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధర ఏగ్రేడ్ క్వింటాల్‌కు రూ.2320, బీగ్రేడ్‌కు రూ.2300 ధర ఉంటుందని అన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి, తేమశాతాన్ని చూసుకొని ధాన్యాన్ని విక్రయిం చాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం అలవాల రవి, సీసీ ఐలయ్య, మేడారం డైరెక్టర్ మిలుకూరి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ పోశాల అనిత, కమిటీ సభ్యులు మెట్టు రజిని, నరెడ్ల శోభ, ముప్పు నిరోష, కొప్పుల సుమలత, గాలి కన్నక్క, వీవోఏలు శెట్టి మంజుల, రాజప్రమీల, యాకూబ్‌బీ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంగపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంపోనిగూడెం రైతు వేదిక భవనంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వ ర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మం డల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరామిరెడ్డిలతో పాటు జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలాగే మంగపేట గ్రామపంచాయతీ ఆవరణంలోని గ్రంథాలయాన్ని రవించదర్ ఆకస్మికంగా తనిఖీచేశారు.

'చెన్నూరు ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఖండనీయం'

మహదేవపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం మహదేవపూర్ మండల అధ్యక్షుడు గోగుల నాగేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే తన వ్యాఖ్యను తక్షణమే వెనక్కితీ తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతకాని సమాజాన్ని రాజకీయంగా అవకాశాలు లేకుండా చేయడం కాదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గండ్రకు సన్మానం

మొగుళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కబడ్డీ అసోసియేషన్ నాయకులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ కబడ్డీ క్రీడాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కబడ్డీ క్రీడను క్రీడాకారులు సద్వినియోగం చేసుకో వాలని, ఇందుకోసం కమిటీ సభ్యులు ఎల్లవేళలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పండుగ శ్రీనివాస్, చైర్మన్ తక్కళ్లపల్లి రాజు పాల్గొన్నారు.

ప్రకాశ్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

కాటారంలో గురువారం క్రెడిట్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ప్రకాష్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల రవి, నాయకులు అప్పం కిషన్, తక్కళ్లపల్లి రాజు, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలో మెలకువలు పాటించాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరి కోతలో హార్వెస్టర్ నిర్వాహకులు మెలకువలు పాటించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ప్రతి హార్వెస్టర్ వరికోత సమయంలో 18-20 ఆర్‌పీఎం నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ వరిపంట కోతలో పాల్గొన్న హార్వెస్టర్ యజమానులతో ఆయన గురవాఆరం సమావేశమయ్యారు. ప్రతి హార్వెస్టర్ వరికోత సమయంలో 18-20 ఆర్‌పీఎం నిర్వహించాలని, తద్వారా మంచి వరి వస్తుందని, తాలు, పండని ధాన్యం కూడా తొలగించబడుతుందని అన్నారు. హార్వెస్టర్ ఈవిధానాన్ని అనుసరిస్తే రైతులు వరి సగటు నాణ్యత కోసం మళ్లీ వరిని శుభ్రం చేయాల్సిన అవసరం ఉండదని, రైతులకు ఖర్చులు తగ్గుతాయని అన్నారు. అన్ని మండలాల వ్యవసాయ అధికారులు హార్వెస్టర్ యజమానులతో మండలస్థాయిలో సమావేశం నిర్వహించి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా ధాన్య కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ పనిచేస్తుందా, గన్నీ సంచులు అందాయా, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయా, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు అయిన రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్, డీసీఎస్‌వో ఫైజుల్‌హుస్సేనీ, డీఎండీసీఎస్‌వో రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, గిరిజన సహకార కార్పొరేషన్ డీఎం ప్రతాప్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, పోలీస్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వస్తున్న రోగులను ఆప్యాయతతో పలకరిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావుతో కలిసి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం డాక్టర్లు, ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తేనే వైద్య ఆరోగ్యశాఖ పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని అన్నారు. అత్యవసరం నిమిత్తం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఏమైనా పరికరాలు అవసరం పడితే వాటిని కొనుగోలు చేసి వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం వైద్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పనితీరును తెలుసుకుని నిర్దిష్టమైన ప్రణాళికతో ఒక కాలపరిధిని ఎంచుకుని కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈసమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారి విపిన్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, భవ్యశ్రీ, డెమో సంపత్, ఎన్‌హెచ్‌ఎంలు తిరుపతిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

'అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

మహదేవపూర్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మేత కోసం గొర్రెలను తీసుకువెళ్లిన తమపై అటవీ అధికారులు దురుసుగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని గొర్రెల కాపర్లు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మహదేవపూర్ మండలంలోని రాపల్లికోట గ్రామానికి చెందిన తాము పలిమెల మండలంలోని బూర్గుగూడెం శివారు ప్రాంతంలో గొర్రెలను మేపేందుకు వెళ్లామని తెలిపారు. ఈక్రమంలోనే గురువారం ఉదయం కొంత మంది అటవీ అధికారులు గొర్రెల రక్షణ కోసం వేసిన వలలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తామేమీ అటవీ భూమిని పోడు చేయడం లేదని, చెట్లకు ఎలాంటి హాని తలపెట్టడం లేదని చెప్పినా ఫారెస్టు అధికారులు వినిపించుకోలేద, పైగా దౌర్జన్యం చేసి తమను భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. అటవీ అధికారులు దాడులకు పాల్పడితే యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఈవిషయమై పలిమెల ఫారెస్టు అధికారి నాగరాజును వివరణ కోరగా గొర్రెల కాపర్లను అటవీ ప్రాంతం నుంచి వెళ్లిపోమ్మని నెల రోజుల క్రితమే సూచించినట్లు తెలిపారు. ఐదుసార్లు వారికి హెచ్చరికలు జారీ చేసినప్పటికీ అటవీ ప్రాంతం నుంచి వెళ్లలేదన్నారు. దీంతో గురువారం ఉదయం వారి నుంచి వలలను తీసుకొచ్చామని, మళ్లీ వచ్చి అడిగితే తిరిగి ఇచ్చేశామని చెప్పారు. కాపర్లను తాము దూషించింది అవాస్తవమని, సూచనలు మాత్రమే చేశామని అన్నారు. తాము అటవీ చట్టానికి లోబడే కాపర్లకు పలు సూచనలు చేశామని వివరించారు.

బోధన సిబ్బంది నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొబ్బలపాడు మోడల్ స్కూల్‌లో పార్ట్‌టైం పని చేయడానికి బోధన సిబ్బంది నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ రవి తెలిపారు. పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ జువాలజీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 11న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని, గరిష్ఠ వేతనం 18,200 ఉంటుందని తెలిపారు.

ఆర్‌ఎంపీల వద్ద గర్భవిచ్ఛిత్తి మాత్రలు?

గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా వినియోగం

పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రథమ చికిత్స చేయాల్సిన వారు ఏకంగా అబార్షన్లు సైతం చేస్తున్నారని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా గర్భవిచ్ఛిత్తి మాత్రలు ఇస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 5న భూపాలపల్లి మండల పరిధి మారుమూల అటవీ ప్రాంతంలోని ఓ గ్రామానికి చెందిన వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఈ మాత్రలు వేసుకొని అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ ఆర్‌ఎంపీ హస్తం ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ విచారణలో తేలినట్లు సమాచారం. ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి గర్భవిచ్ఛిత్తి మాత్రలను ఇస్తుంటే తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు భూపాలపల్లి, గణపురం, కాటారం, టేకుమట్ల మండలాలకు చెందిన కొంతమంది ఆర్‌ఎంపీలు సర్జరీలు కూడా చేస్తున్నట్లు సమాచారం.

భూపాలపల్లిలో ఇటీవల ఓ ఆర్‌ఎంపీ చేసిన సర్జరీ విఫలమైతే బాధితురాలి బంధువులు నిరసనకు దిగగా గుట్టుచప్పుడు కాకుండా రాజీ కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆర్‌ఎంపీలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆగని దందా

(5వ పేజీ తరువాయి)

నెల షాపులకు ఎంత రేషన్ బియ్యం వస్తుంది.. లబ్ధిదారులకు ఎంత అందుతోంది? అనేది లెక్కలు తీయాల్సి ఉంటుంది. అయితే.. ఇదంతా ఎక్కడా కానరావడం లేదు. రేషన్ షాపులను తనిఖీ చేస్తున్న దాఖలాలు జిల్లాలో లేవనే ఆరోపణలు వస్తున్నాయి. యథేచ్ఛగా డీలర్లు అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆర్డీవో మంగిలాల్ ఈ వ్యవహారంపై స్పందించారు. రేషన్ షాపులను మండల రెవెన్యూ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఆయన ఆదేశాలు బేఖాతర్ అయ్యాయి. మండలాల్లో ఎక్కడి అవినీతి అక్కడే తిష్టవేసి ఉంది. దీంతో ఆర్డీవో చేసేదేమీ లేక రంగంలోకి దిగారు. ఇటీవల కొన్ని షాపులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. అయినా ఈ దందాకు అడ్డుకట్ట పడలేదు. ఆర్డీవో రంగంలోకి దిగిన పలు చోట్ల కొంత సత్ఫలితాలు ఇచ్చినా చాలా చోట్లా ఇది యథేచ్ఛగానే కొనసాగుతోందనే తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ఆయా మండలాల అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తేనే రేషన్ డీలర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మంగపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరునర్సాపురం, మంగపేట మార్గంలో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇసుక లారీలను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కన్నాయిగూడెం మండలంలోని కంతనపెల్లి గ్రామానికి చెందిన ఎంపెల్లి నాగేశ్వర్‌రావు ఏటూరునాగారం వైపు నుంచి మణుగూరు వైపు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాంబయ్యగూడెం క్వారీ నుంచి ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్న లారీని తప్పించబోయింది. గౌరారం వాగు బ్రిడ్జి సమీపంలో బోల్తా పడింది. దీంతో నాగేశ్వర్‌రావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఏటూనా గారం సామాజిక వైద్యశాలకు తరలించారు. అనంతరం ములుగు ఏరియా ఆస్పత్రికి పంపారు. నాగేశ్వర్‌రావు పరిస్థితి విషమంగానే ఉందని తెలిసింది.

గాయపడ్డ ఇద్దరు యువకులు

మహదేవపూర్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మాపూర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెగ్లూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. మహదేవ పూర్ నుంచి బెగ్లూర్ వెళ్తున్న యువకులను ఎదు రుగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టడంతో ఈ ప్ర మాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధంచి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనాల ఢీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో రెండు ద్విచక్ర వాహనాలు గురువారం ఢీకొన్నాయి. సుభాష్‌కాలనీ వైపు వెళ్లేందుకు ఇరువురు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్ పడటంతో వేచి ఉన్నారు గ్రీన్ సిగ్నల్ పడటంతో ఆదరాబాదరా వెళ్తున్న క్రమంలో రెండు ఒకదానికొకటి ఢీకొన్నాయి. రెండు వాహనాలు కిందపడిపోగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

వ్యవసాయ పరికరాల చోరీ

వాజేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్చి రైతులు దొంగల బెడదతో ఆందోళన చెందుతున్నారు. అసలే అంతంతమాత్రంగా సాగు ఉండగా తెగుళ్లతో పాటు దొంగల బెడద ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగలు వ్యవసాయంలో వినియోగించే విలువైన పరికరాలను చోరీ చేస్తూ ఉడాయిస్తున్నారు. గురువారం సైతం మండలంలోని జగన్నాథపురంకు చెందిన గార నాగులు అనే రైతుకు చెందిన డ్రిప్ వెంచర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వేలాది రూపాయల పరికరాలు అపహరణకు గురికావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.